నేడు కలెక్టరేట్లో యధావిధిగా పిజిఆర్ఎస్

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం యధావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. డివిజన్, మండల స్థాయిలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయా అధికారులు అందరూ విధిగా హాజరవుతారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

పాలకొల్లు: పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మంత్రి రామానాయుడు

నిర్దాక్షిణ్యంగా 42 ఇళ్లు కూల్చివేత

పేదలు బతిమాలినా బలవంతంగా ఖాళీ చేయించి బుల్డోజర్‌తో పడగొట్టించిన అధికారులు

పేదల రోదనలతో హోరెత్తిన ఎస్ఆర్ నగర్

మొహరించిన 150 మంది పోలీసులు

గృహనిర్బంధంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, నేతలు సత్యనారాయణ, అశ్రియ్య

భూస్వాములకు దోచిపెట్టేందుకే పేదలపై ఎంఎల్ఎ యుద్ధం

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

కూల్చివేతకు గురైన ఇళ్లు

గృహనిర్బంధంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

పాలకోడేరు ఎఎస్ఆర్ నగర్ ఆదివారం నిరుపేదల ఆర్తనాదాలతో హోరెత్తింది. తమ గూడు కూలగొట్టొద్దు అంటూ బతిమాలినా అధికారులు కనికరం చూపకపోవడంతో వారు నిశ్చేష్టులయ్యారు. పొయ్యిపై అన్నం ఉడుకుతున్నా బలవంతంగా పేదలను ఖాళీ చేయించారు. కరెంటు కనెక్షన్లు కట్ చేసి బుల్డోజర్లతో ఇళ్లను పడగొట్టారు. ఇంటికి పది మంది పోలీసులను మొహరించి ఆ ప్రాంతాన్ని దిగ్బంధనం చేశారు. ఆపై పేదలకు చెందిన 42 ఇళ్లను కూలగొట్టారు. పేదలకు మద్దతుగా వస్తారనే ఆలోచనతో సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, మండల కార్యదర్శి శేషపు అశ్రియ్యను గృహనిర్బంధం చేయగా, పేదల వద్దకు వస్తున్న జిల్లా కమిటీ సభ్యుడు జక్కంశెట్టి సత్యనారాయణను పోలీసులు మధ్యలో అడ్డుకుని నిర్బంధించారు.

ఎఎస్ఆర్ నగర్‌లో పేదల ఇళ్లను ఆదివారం తెల్లవారుజామున భారీ బందోబస్తు నడుమ అధికారులు తొలగించారు. ఇళ్ల తొలగింపునకు అధికారులు శనివారం గట్టి ప్రయత్నం చేసినప్పటికీ పేదల నుంచి ప్రతిఘటన ఎదురవ్వడంతో వెనక్కి తగ్గిన విషయం తెలిసిందే. ఈ సమయంలో పోలీసులు అధికారులు సిపిఎం నేతలు, నిరుపేదలతో చర్చలు జరిపారు. జిల్లా అధికారులతో మాట్లాడుకోమని అవకాశం ఇచ్చారు. అయితే సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్‌ను భీమవరంలో, పాలకోడేరు మండల కార్యదర్శి శేషపు అశ్రియ్యను పెన్నాడలో ఇళ్ల వద్ద ఆదివారం తెల్లవారుజామున పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఎఎస్ఆర్ నగర్‌లో 144 సెక్షన్ విధించారు. ఆదివారం వేకువజామునే ఎఎస్ఆర్ నగర్‌ను ప్రత్యేక పోలీసు బలగాలు చుట్టుముట్టాయి. ఆ ప్రాంతాన్ని పూర్తిగా తమ అధీనంలోకి తీసుకుని ఇళ్లలో నిద్రిస్తున్న వారిని లేపి ఖాళీ చేస్తారా లేక అలాగే ఇళ్లు కూల్చేయమంటారా అని భయభ్రాంతులకు గురి చేశారు. కనీసం సామాన్లు తీసుకునే సమయం ఇవ్వాలని కోరినా వెంటనే ఖాళీ చేయకపోతే అలానే కూల్చేస్తామంటూ బెదిరింపుల పర్వానికి దిగారు. మరోపక్క ఇళ్లకు కరెంటు కనెక్షన్లు తొలగించారు. ఇంటికి పది మంది చొప్పున పోలీసులను మొహరించారు. వృద్ధులు, మహిళలు, పేదలు పోలీసులకు దండం పెట్టి మా ఇళ్లను పడగొట్టకండి అయ్యా అని వేడుకున్నా పట్టించుకోకుండా ముందుకు సాగారు. ఇంటి స్థలం ఇవ్వకుండా.. ఏళ్ల తరబడి ఉంటున్న ఇంటిని కూల్చేయడంతో ఒక మహిళ సొమ్మసిల్లి పడిపోయింది. దీంతో నిరుపేదలు బరువెక్కిన గుండెతో కన్నీరుమున్నీరవుతూ సామాన్లపై పక్కనే రోడ్డుపై కూర్చుని పడగొట్టిన తమ ఇళ్ల శిథిలాల వైపు చూస్తుండటం అందరినీ కలిచివేసింది.

ఇళ్లు కూల్చేస్తున్న పొక్లెయిన్

సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్, మండల కార్యదర్శి అశ్రియ్య గృహనిర్బంధం

భీమవరంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్‌ను, పెన్నాడలో మండల కార్యదర్శి శేషపు అశ్రియ్యను ఆదివారం తెల్లవారుజామున పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఒకపక్క జిల్లా అధికారులతో మాట్లాడుకోమని అవకాశం కల్పించిన పోలీసులు, అధికారులు మాట తప్పి నిర్బంధం ప్రయోగించడం గమనార్హం. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ కుముదవల్లి కాల్వ గట్టు నుంచి ఎఎస్ఆర్ నగర్‌లోకి వెళ్తుండగా పోలీసులు అడ్డుకుని బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. అక్కడ నుంచి పాలకోడేరు పోలీస్ స్టేషన్‌కు, అక్కడ నుంచి భీమవరం రూరల్ స్టేషన్‌కు సత్యనారాయణను తరలించారు.

42 ఇళ్లను కూలగొట్టిన అధికారులు

ఎఎస్ఆర్ నగర్‌లో 1986 నుంచి 130 కుటుంబాలు నివాసముంటున్నాయి. వీరిలో కొంతమందికి ఇళ్ల స్థలాలు కేటాయించారు. అయితే సంబంధిత ప్రభుత్వ కాలనీ నివాస యోగ్యంగా లేదు. మరికొంతమందికి ఇచ్చిన ప్రభుత్వ స్థలం కోర్టు కేసులో నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఎఎస్ఆర్ నగర్‌లో ఇళ్ల తొలగింపు చేపట్టిన నేపథ్యంలో కొంతమంది కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. మిగిలిన 50 ఇళ్లు కూల్చేందుకు అధికారులు రంగంలోకి దిగారు. ఆదివారం సాయంత్రానికి 42 ఇళ్లను కూలగొట్టారు. కోర్టు కేసు పరిష్కారమయ్యాక మిగిలిన ఇళ్లనూ తొలగిస్తామని అధికారులు చెబుతున్నారు.

కాల్వ గట్టుపైనే సామాన్లు పెట్టుకున్న బాధితులు

ఉండి నియోజకవర్గంలో పోలీస్ రాజ్యం అమలు

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ఎఎస్ఆర్ నగర్‌లో నివశిస్తున్న పేదల ఇళ్ల తొలగింపు అన్యాయం. జిల్లా అధికార యంత్రాంగంతో మాట్లాడి ఇళ్ల కూల్చివేతను ఆపాలని కోరినా ఫలితం లేకుండాపోయింది. 130 కుటుంబాల్లో 50 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు లేవు. కొంతమందికి ఇచ్చిన స్థలాలు కోర్టు వివాదాల్లో ఉంది. కొంతమంది స్థలాల పూడిక జరగలేదు. ఇలాంటి సమయంలో ఎక్కడికి వెళ్లాలో తెలియని దిక్కుతోచని పరిస్థితుల్లో పేదలు ఉండగా ఎంఎల్ఎ అహంకార పూరిత వైఖరి వల్ల అధికార యంత్రాంగం పేదల ఇళ్లను దౌర్జన్యంగా తొలగించింది. ఎవరికీ అభ్యంతరం కాని చోట్ల, గ్రామాలకు శివారు ప్రాంతంలో నివశిస్తున్న పేదల ఇళ్లు ఎవరి కోసం తొలగించారో ఎంఎల్ఎ, జిల్లా అధికారులు చెప్పాలి. పేదల ఇళ్ల వెనుక ఉన్న భూస్వాముల భూములకు మరింత మేలు చేకూర్చేందుకే ఎంఎల్ఎ పేదలను రోడ్డున పడేశారు. శనివారం పేదలందరూ ప్రతిఘటించగా వెనక్కి తగ్గిన యంత్రాంగం జిల్లా అధికారులతో మాట్లాడుకోమని చెప్పారు. సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలవాలనుకుంటే ఆదివారం తెల్లవారుజాము నుంచే నేతలను గృహనిర్బంధం చేసి ఇళ్లు తొలగించడం పోలీసు రాజ్యానికి నిదర్శనం. గత ప్రభుత్వం కంటే ఎక్కువ నిర్బంధాన్ని ప్రజలపై ప్రయోగిస్తున్నారు. ఆకివీడు నుండి పాలకోడేరు వరకు కొన్ని వందల పేదల ఇళ్లను దుర్మార్గంగా తొలగిస్తున్నా సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేషగాని ఏమాత్రం స్పందించకపోవడం, కనీసం నియంత్రించకపోవడం బాధాకరం. ఇప్పటికైనా పేదలపై దాడులను, సిపిఎం నాయకుల గృహనిర్బంధాలను ఆపాలి. పేదలకు ప్రత్యామ్నాయ ఇళ్ల స్థలాలు చూపి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలి.

ఇళ్ల శిథిలాల వద్దే రోడ్డుపై నిద్రిస్తున్న బాధిత మహిళలు

అధైర్య పడొద్దు.. పోరాడుదాం

ఇళ్ల బాధితులకు సిపిఎం నేతల పరామర్శ

పాలకోడేరు ఎఎస్ఆర్ నగర్‌లో ఇళ్ల తొలగింపు బాధితులను సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, మండల కార్యదర్శి ఎస్.అశ్రియ్య ఆదివారం రాత్రి పరామర్శించారు. ఉన్న గూడు పీకేయడంతో చీకట్లో పక్కనే రోడ్డుపైనే సామాన్లు పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ ఉన్న బాధితులను ఆయన ఓదార్చారు. బాధితులు ఆదివారం తెల్లవారుజాము నుంచి అధికారులు వ్యవహరించిన తీరు చెప్పి కన్నీరుమున్నీరయ్యారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ బాధితులు అధైర్యపడొద్దని, సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు. న్యాయం జరిగే వరకూ పోరాడుదామని భరోసా ఇచ్చారు. ఇళ్లను బలవంతంగా ఖాళీ చేయించి కూల్చడం దారుణమని, స్థలాలు ఇవ్వని పేదల ఇళ్లు సైతం కూల్చడం అన్యాయమని అన్నారు.

బాధితులతో మాట్లాడుతున్న జెఎన్‌వి.గోపాలన్, అశ్రియ్య

ఇళ్ల తొలగింపుపై నిరసన

ప్రజాశక్తి - భీమవరం

పాలకోడేరు ఎఎస్ఆర్ నగర్‌లో అన్యాయంగా పేదల ఇళ్లను తొలగించడాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో లంకపేటలో ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ నాయకులు ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు పేదలకు ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లు తొలగింపు చర్యలు చేపట్టడం దారుణమన్నారు. నాయకులు మల్లిపూడి ఆంజనేయులు మాట్లాడుతూ రైతులకు మేలు చేస్తామని చెప్పి ఎన్నోఏళ్లుగా నివాసముంటున్న పేదల ఇళ్లను తొలగించడం దారుణమన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఇంజేటి శ్రీనివాస్, డి.త్రిమూర్తులు, సాయమ్మ, కుమారి, సోమేశ్వరరావు, రమేష్, ఏసు పాల్గొన్నారు.

నిరుపేదల ఎంఎల్ఎ తీరు దారుణం: ఏపి కౌలురైతుసంఘం

నిరుపేదల ఇళ్ల తొలగింపులో ఉండి ఎంఎల్ఎ రఘురామ కృష్ణంరాజు తీరు దారుణంగా ఉందని ఏపి కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు ఒక ప్రకటనలో విమర్శించారు. తక్షణం పేదలపై కక్షసాధింపు చర్యలు ఆపాలని, రోడ్డున పడ్డ వారందరికీ ప్రభుత్వమే తక్షణం ప్రత్యామ్నాయం చూపి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

భీమవరం నిరసన తెలియజేస్తున్న సిపిఎం నేతలు

విజనరీ లీడర్ చంద్రబాబు

మంత్రి రామానాయుడు

ఘనంగా సిఎం చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రం ఆవిర్భావం నుంచి నవ్యాంధ్రప్రదేశ్ వరకు చరిత్ర రాస్తే సగానికి సగం చంద్రబాబు అధ్యాయాలు ఉంటాయని రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లులో తన క్యాంపు కార్యాలయంలో సిఎం చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరంతోపాటు పేదలకు పలు సేవా కార్యక్రమాలను మంత్రి నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి నియోజకవర్గ ప్రజల తరపున చంద్రబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 50 మంది రక్తదానం చేశారు. నిరుపేద మహిళలకు చీరలు, వికలాంగులకు బియ్యం, దుప్పటి వంటివి అందజేశారు. అందరికీ ఫ్రూటీ ప్యాకెట్లు పంచారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి రామానాయుడు మాట్లాడుతూ చంద్రబాబు నేతృత్వంలో పని చేయడం తమ అదృష్టమని, ఆయన విజనరీ ఉన్న లీడర్ అని అన్నారు. మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ మాట్లాడుతూ చంద్రబాబు రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చెందే దిశగా నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పెచ్చెట్టి చంద్రమౌళి, పెచ్చెట్టి బాబు, బోనం చినబాబు, ఉనమట్ల కబర్ది, బోనం నాని, మామిడిశెట్టి పెద్దిరాజు, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, కడలి గోపి, తులా రామలింగేశ్వరరావు, జక్కంపూడి కుమార్, బొప్పన హరికిషోర్ పాల్గొన్నారు.



భీమవరం: కేక్ కట్ చేస్తున్న ఎంఎల్ఎ అంజిబాబు, మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి

భీమవరం టౌన్: శాంతిభద్రతలు క్షీణించి, అథపాతాళంలోకి కూరుకుపోయిన రాష్ట్రాన్ని ప్రగతిబాటలోకి తీసుకురావడం సిఎం చంద్రబాబుకే సాధ్యమని, ఆయన పనిలో చూపే ఉత్సాహం అద్భుతమని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. టిడిపి పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం సిఎం చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను నిర్వహించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి వర్మ, ఎంఎల్ఎ అంజిబాబు మాట్లాడుతూ చంద్రబాబు విజన్ నిరంతరం పనిలో చూపే ఉత్సాహం అద్భుతమన్నారు. ఎపిఐఐసి ఛైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు, మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి, జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు (చినబాబు) మాట్లాడుతూ భవిష్యత్తును ముందుగానే అంచనా వేసి అందుకు అనుగుణంగా వ్యవస్థలను నడిపించే విధానం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వీర మహిళలు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన అంజిబాబు, తోట సీతారామలక్ష్మి

అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు రూ.5కే భోజనం అందిస్తున్నారని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి అన్నారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సిఎం చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు నిర్వహించి వెయ్యి మందికి భోజనం అందించారు.

తణుకు: రాష్ట్రంలో పేదల అభ్యున్నతికి పాటుపడిన వ్యక్తి చంద్రబాబు అని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సిఎం చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం తణుకులో పండుగలా వేడుకలు నిర్వహించారు. తణుకు నియోజకవర్గంలో చంద్రబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఎంఎల్ఎ రాధాకృష్ణ భారీ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ టిడిపి శ్రేణులకు ఏప్రిల్ 20 పండుగ రోజని అన్నారు. చంద్రబాబు కృషిని స్ఫూర్తిగా తీసుకుని యువత పార్టీ పటిష్టత కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టారు. పట్టణంలోని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో కూటమి శ్రేణులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎంఎల్ఎ ప్రారంభించారు. జిల్లా ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం సంధ్యాజ్యోతి, వాసవిజ్యోతి వృద్ధాశ్రమాల్లో అన్నదాన కార్యక్రమాలో రాధాకృష్ణ పాల్గొన్నారు. గుడ్ సమరిటన్ చిల్డ్రన్ హోమ్‌కు రూ.10వేలు విరాళం అందజేశారు.

తణుకు: కేక్ కట్ చేస్తున్న ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, ప్రముఖులు

ఎట్టకేలకు డిఎస్‌సికి మోక్షం

- ఏడాదిగా ఊరించి నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం
- పరీక్షకు 45 రోజుల వ్యవధి ఇవ్వడంపై అభ్యర్థుల్లో అసంతృప్తి
- ఉమ్మడి పశ్చిమలో మొత్తం 1,074 పోస్టులు మంజూరు
- 25 వేల మందికిపైగా అభ్యర్థులు పోటీపడే అవకాశం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎట్టకేలకు డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలైంది. నిరుద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి కూటమి ప్రభుత్వం ఆదివారం పచ్చజెండా ఊపింది. రాష్ట్రవ్యాప్తంగా 16,347 ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది. ఏప్రిల్ 20వ తేదీ నుంచి మే 15వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థులు డిఎస్‌సికి దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్ 6వ తేదీ నుంచి జులై ఆరో తేదీ వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తారు. మెగా డిఎస్‌సి-2025 పరీక్షకు సంబంధించిన పూర్తి సమాచారం అంటే సంబంధిత జిఒలు, పోస్టుల వివరాలు, పరీక్ష షెడ్యూల్, సిలబస్, నోటిఫికేషన్, హెల్ప్‌డెస్క్ వివరాలు పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచారు. ప్రభుత్వం విడుదల చేసిన డిఎస్‌సి నోటిఫికేషన్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అన్ని కేటగిరీల్లో 1,074 పోస్టులు ప్రభుత్వం మంజూరు చేసింది. సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 420 ఉండగా, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 615 ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో లాంగ్వేజ్-1 పోస్టులు 42, హిందీ 61, ఇంగ్లీష్ 84, మ్యాథ్స్ 40, ఫిజికల్ సైన్స్ 40, బయోలజీ 64, సోషల్ 103, ఫిజికల్ ఎడ్యుకేషన్ 181 ఉన్నాయి. ఇవి కాకుండా ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 32 పోస్టులు, జువైనల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ పాఠశాలల్లో ఏలూరు జిల్లాలో ఏడు పోస్టులు ఉన్నాయి. విభిన్న ప్రతిభావంతుల పాఠశాలల్లో రాష్ట్రస్థాయిలో 31 పోస్టులు, ఎపి రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో జోన్-2లో 348 పోస్టులు ఉన్నాయి. వీటిలో కూడా జిల్లా అభ్యర్థులు పోటీ పడవచ్చు. ఏప్రిల్ 20 నుంచి మే 15వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థులు ఫీజు చెల్లించవచ్చు. అలాగే నమూనా పరీక్ష మే 20వ తేదీ నుంచి నిర్వహిస్తారని నోటిఫికేషన్‌లో తెలిపారు. జూన్ ఆరో తేదీ నుంచి జులై ఆరో తేదీ వరకు డిఎస్‌సి పరీక్షలు జరగనున్నాయి. అన్ని పరీక్షలు పూర్తయ్యాక ప్రాథమిక కీ విడుదల చేస్తారని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ప్రాథమిక కీ విడుదల అనంతరం ఏడు రోజులపాటు అభ్యంతరాలు స్వీకరిస్తారని, అభ్యంతరాల స్వీకరణ గడువు ముగిసిన ఏడు రోజుల తర్వాత తుది కీ విడుదల చేస్తారని, తుది కీ విడుదల చేసిన ఏడు రోజుల తర్వాత మెరిట్ జాబితా ప్రకటిస్తారని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

45 రోజుల సమయంపై అసంతృప్తి

2019 తర్వాత ఇప్పటి వరకు ఐదు సంవత్సరాలపాటు డిఎస్‌సి నిర్వహించలేదు. సుమారు 25 వేల మంది అభ్యర్థులు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోటీపడే అవకాశం కనిపిస్తుంది. కూటమి ప్రభుత్వం తొలిసంతకం మెగా డిఎస్‌సిపై పెట్టింది. దీంతో అభ్యర్థులంతా కోచింగ్ సెంటర్లకు వెళ్లి కష్టపడ్డారు. ఏడాది గడుస్తున్నా నోటిఫికేషన్ ఇవ్వకపోవడంతో చాలామంది మళ్లీ పుస్తకాలను పక్కన పెట్టేశారు. నోటిఫికేషన్, పరీక్షకు మధ్య కేవలం 45 రోజుల సమయం మాత్రమే ఇచ్చారంటూ అభ్యర్థుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. కనీసం మూడు నెలల సమయం ఇవ్వాలని అభ్యర్థులు కోరుతున్నారు.

తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బలరాం

ప్రజాశక్తి - పాలకోడేరు

వేసవిలో తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం పెన్నాడలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని బలరాం ప్రారంభించారు. 30 మంది పేదలకు పారిశ్రామిక వేత్త కొత్తపల్లి గోపాలకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ పెరుగుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు తాగునీటి కొరత లేకుండా చూడాలన్నారు. ప్రయాణికుల సౌలభ్యం కోసం వారి దాహార్తిని తీర్చే విధంగా వ్యకాస ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం నిర్వహించడం అభినందనీయమన్నారు. చలివేంద్రానికి మహానేత పుచ్చలపల్లి సుందరయ్య పేరు పెట్టడం ఆనందదాయకమన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్ మాట్లాడుతూ అన్ని మండలాల్లో సిపిఎం ఆధ్వర్యంలో చలివేంద్రాలు, సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య, నాయకులు ఎస్.నాగలక్ష్మి, ఎస్.భవాని, శివప్రసాద్ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న గోపాలకృష్ణ

వృద్ధురాలికి ఉచిత వైద్య సేవలు అందజేస్తున్న డాక్టర్

వృద్ధులకు ఉచిత వైద్యం

ప్రజాశక్తి - తణుకు

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహించే ఇంటింటికీ వైద్యం కార్యక్రమంలో భాగంగా ప్రముఖ నేత్ర వైద్యులు హుస్సేన్ అహ్మద్, ఆర్థో నిమ్మగడ్డ అచ్యుతరామయ్య తణుకు, చివటం ప్రాంతాల్లో పర్యటించి ఎనిమిది మంది వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందజేశారు. సంఘం సభ్యులు షేక్ మస్తాన్ ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి అర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులకు పవర్ టిల్లర్లు, రోటోవేటర్లు అందజేస్తున్న ఎంఎల్ఎ రాధాకృష్ణ

రైతు పక్షపాతి చంద్రబాబు : ఎంఎల్ఎ రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

రైతు సంక్షేమం, అభివృద్ధి కోసం రైతు పక్షపాతిగా పని చేసే నేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ కొనియాడారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో తణుకు నియోజకవర్గంలో 43 మంది రైతులకు రూ.1.02 కోట్ల విలువైన పవర్ టిల్లర్లు, రోటోవేటర్లు యాభై శాతం రాయితీతో అందజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయంలో నూతన పద్ధతులు, యాంత్రీకరణ రైతులకు అలవాటు చేసి ప్రభుత్వం నుంచి రావాల్సిన సంక్షేమ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు అమలుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో తణుకు నియోజకవర్గంలో రైతు పోరుబాట యాత్ర చేసి రైతుల పక్షాన నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి రైతుకు రూ.20వేలు అందించేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలతో సంబరాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలతో పాలకొల్లులో మంత్రి నిమ్మల రామానాయుడు 78 రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత డిఎస్‌సి శిక్షణ తరగతుల కేంద్రంలో ఘనంగా సంబరాలు జరిపారు. డిఎస్‌సి అభ్యర్థులు మంత్రి రామానాయుడు ఆధ్వర్యంలో కేకుకట్ చేసి ప్లకార్డులు ప్రదర్శించి థాంక్యూ సిఎం అంటూ నినాదాలు చేశారు. అనంతరం మోడీ చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ కటౌట్‌కు పాలాభిషేకం చేశారు. చంద్రబాబు పుట్టినరోజు కానుకగా లోకేష్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయడం చారిత్రాత్మక నిర్ణయం అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తొలి ఐదు సంతకాల్లో డిఎస్‌సి ఒకటి అన్నారు. వన్ క్లాస్, వన్ టీచర్ విధానంతో రాష్ట్రంలో ప్రభుత్వ విద్య బలోపేతం అయ్యేలా మంత్రి లోకేష్ విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకున్నారన్నారు.

వాణీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించే వివిధ పోటీల్లో పాల్గొన్నప్పుడే వారికి పోటీతత్వం అలవడి విజ్ఞానవంతులుగా తయారవుతారని వాణీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు గ్రహీత వాణికృష్ణ అన్నారు. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన జీనియస్ రామానుజన్ అకాడమీ ఆఫ్ మ్యాథ్స్ అండ్ సైన్స్ స్కిల్స్ ఫర్ ఐఐటి ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి ప్రతిభ పరీక్షల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని వాణీకృష్ణ తెలిపారు. ప్రాథమిక, జిల్లాస్థాయిలో 21 మంది ప్రతిభ కనబర్చి, రాష్ట్రస్థాయి ఫైనల్ పరీక్షకు అర్హత సాధించగా రాష్ట్రస్థాయిలో 11 మంది ప్రతిభ కనబర్చి ఉత్తమ ర్యాంకులు సాధించారని జిఆమెఎంఎస్ఐ టి ఫౌండేషన్ సంస్థ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలియజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో ఆయా విద్యార్థులను వాణి స్కూల్ డైరెక్టర్ వాణికృష్ణ, వాణీ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యవర్గ సభ్యులు, తదితరులు అభినందించారు.

నేర పరిశోధనలో మన పోలీసులు అద్భుతం

ఎబిసిడి అవార్డు అందుకున్న పోలీసులకు ఎంఎల్ఎ అంజిబాబు అభినందనలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

నేర పరిశోధనలో మన భీమవరం పోలీసులకు రాష్ట్రస్థాయిలోనే ఎబిసిడి అవార్డు రావడం అభినందనీయమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. అవార్డు అందుకున్న టుటౌన్ సిఐ కాళీచరణ్‌ను ఎంఎల్ఎ అంజిబాబు అభినందించారు. ఎస్‌పి, డిఎస్‌పి, సిఐలకు ఎబిసిడి అవార్డు రావడం ఇవ్వడం గొప్ప విశేషమని, అత్యంత చాకచక్యంగా నేర పరిశోధనలు చేసి నేరస్తులను అదుపులోకి తీసుకోవడంలో సాహసం చేసినందుకు ఈ అవార్డులు వచ్చాయని అన్నారు.

పదో అదనపు జిల్లా న్యాయమూర్తిగా వాసంతి

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పదో అదనపు జిల్లా న్యాయమూర్తిగా ఎ.వాసంతి ఆదివారం తణుకు నాలుగో జిల్లా న్యాయమూర్తి డి.సత్యవతి నుండి బాధ్యతలు చేపట్టారు. ఆమె పిఠాపురం 12వ అదనపు జిల్లా న్యాయమూర్తిగా పనిచేస్తూ బదిలీపై నరసాపురం పదో జిల్లా న్యాయమూర్తిగా వచ్చినట్లు కోర్టు పరిపాలన అధికారి డి. నాగేశ్వరావు తెలిపారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన పదో అదనపు జిల్లా న్యాయమూర్తి పి.విజయదుర్గ విశాఖపట్నం సిబిఐ కోర్టు న్యాయమూర్తిగా బదిలీపై వెళ్లారు.

ఘనంగా రైతు రామారావు వందో పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - మొగల్తూరు

రామన్నపాలెం పంచాయతీ ఆకని వారి తోటకు చెందిన అన్నదాత అయితం రామారావు 100 సంవత్సరాల పుట్టినరోజు వేడుకలను ఆదివారం కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. అయితం రామారావు సుబ్బాయమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, 10 మంది మనమలు, 14 మంది ముని మనమలు ఉన్నారు. సుబ్బాయమ్మ గతంలోనే మృతి చెందారు. రామారావు వ్యక్తిగత పనులు ఆయనే స్వయంగా చేసుకుంటారని కుటుంబ సభ్యులు తెలిపారు. రామారావు ఆరోగ్యంగా ఉన్నారన్నారు. కుటుంబ సభ్యులతో సహపంక్తి భోజనాలు చేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకూ ఆటపాటలతో గడిపారు. 100 సంవత్సరాలు వేడుకకు అయితం వారి కుటుంబ సభ్యులందరూ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మూణ్నాళ్ల ముచ్చటే..!

గోతులమయంగా వల్లూరు రహదారి

నాణ్యతా ప్రమాణాలు పాటించని అధికారులు

ప్రజాశక్తి - గణపవరం

అధ్వానంగా తయారైన వల్లూరు రోడ్డు

రోడ్ల నిర్మాణ సమయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు నాణ్యతపై దృష్టి పెట్టకపోవడంతో వల్లూరు గ్రామ ఆర్అండ్‌బి రహదారి నిర్మించిన మూడు నెలలకే రాళ్లు లేచిపోయి రహదారి చిందర వందరగా మారింది. పిప్పర వెళ్లే మెయిన్ రోడ్డు నుంచి వల్లూరు వెళ్లే నాలుగు కిలోమీటర్ల మేర రహదారిని గతేడాది డిసెంబరులో నిర్మించారు. ఈ రహదారి పక్కనే వరి చేలు ఉన్నాయి. దీంతో అటుగుండా ట్రాక్టర్లు, ధాన్యం లోడుతో లారీలు ఎక్కువగా వెళ్తుంటాయి. దీంతో రహదారిపై గోతులు పడి నల్లరాయి లేచిపోతోంది. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై రాళ్లు లేచి గోతులుగా మారడంతో వాహదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గణపవరం నుంచి వల్లూరు మీదుగా వీరేశ్వరపురం, వాకపల్లి, మీదుగా తాడేపల్లిగూడెం, పిప్పర వెళ్ళేవారికి అనువుగా ఉన్న రహదారిని వెంటనే నిర్మించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణానికి రూ.80 లక్షల నిధులు మంజూరు

ఆర్అండ్‌బి జెఇ డికె.రవిబాబు

వల్లూరు రహదారి నిర్మాణానికి రూ.80 లక్షల నిధులు మంజూరయ్యాయి. రహదారి పనులను శాసనసభ్యులు ధర్మరాజు ప్రారంభిచనున్నారు. నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు నిర్మాణం చేస్తాం.

గ్రామాలాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - కాళ్ల

ఏలూరుపాడులో చెరువు తవ్వకం పనులు చేపట్టి నింపిన నీరు

గ్రామాలాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఏలూరుపాడు గ్రామ సర్పంచి భూపతిరాజు వెంకట జగ్గరాజు ఆదివారం తెలిపారు. వెంకయ్య వయ్యేరు నుంచి నేరుగా తాగునీటి చెరువులోకి నీరు వచ్చేలా ప్రత్యేక పైప్‌లైన్ పనులను మండల పరిషత్ నిధులు రూ.12 లక్షలు, జెడ్‌పి నిధులు రూ.20 లక్షలతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ పనులను రూ.12.30 లక్షలతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. దుకాణాల సముదాయాలను పంచాయతీ నిధులు రూ.11.30 లక్షలతో 16 షాపులు నిర్మించామన్నారు. రెండెకరాల దేవస్థానం భూమిలో యుద్ధ ప్రాతిపదికన చెరువు తవ్వకం పనులను రూ.2 లక్షలతో చేపట్టామన్నారు. చెరువులోకి నీటినిపూర్తి స్థాయిలో నింపామన్నారు. ఆ చెరువునీటిని వేసవిలో ఉపయోగించుకుంటామన్నారు. ఎంఎల్ఎ రఘు రామకృష్ణంరాజు రూ.10 లక్షలు, పంచాయతీ నిధులు రూ.12 లక్షలతో మైక్రో వాటర్ ఫిల్టర్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. ఏలూరుపాడు హైస్కూల్లో దాతల సహకారంతో విద్యార్థులకు షటిల్, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్ ఆడేందుకు మూడు కోర్టులను దాత దాట్ల శ్రీనివాసరాజు (స్కాట్లాండ్ వాసు) సుమారు రూ.50 వేలతో గ్రామ సర్పంచి భూపతిరాజు రూ.25 వేలతో వివిధ మొక్కలను ఏర్పాటు చేశామన్నారు. సిమెంట్ డ్రెయినేజీలు, రోడ్లు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం : మాట్లాడుతున్న అధికారి భాస్కర రామమ్

అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం అగ్నిమాపక కేంద్రం వద్ద ముగింపు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సెవెన్ ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి క్యాడెట్స్ హాజరయ్యారు. ఈ వారం రోజులు ఫైర్ సిబ్బంది వివిధ ప్రాంతాలు తిరుగుతూ ప్రజలకు అగ్ని ప్రమాదాల పట్ల అవగాహనా సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్య వంతులను చేశారు. అగ్నిమాపక కేంద్రం వద్ద ఉన్న వివిధ పరికరాలను విపత్తు సమయాల్లో ఉపయోగించి తమ ప్రాణాలను రక్షించుకోవడమే కాకుండా, ప్రజల ప్రాణాలను ఏవిధంగా రక్షించాలో చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో నరసాపురం కేంద్ర అగ్నిమాపక అధికారి కె.భాస్కర రామమ్, ఎన్‌సిసి పిటి ఇన్‌స్పెక్టర్స్ పిఎన్.బాబు పాల్గొన్నారు.

పాలకొల్లు : ఎస్‌ఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, వాలంటీర్లు ఈనెల 14 నుండి 20వ తేదీ వరకూ జరిగిన అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఎం.రామకృష్ణ, వి.విజయలక్ష్మి మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని గృహాల్లో, వ్యాపార కేంద్రాల్లో, బహుళ అంతస్తుల్లో, పరిశ్రమల్లో జరిగే అగ్ని ప్రమాదాలను అరికట్టడానికి, విద్యార్థుల్లో అవగాహన కలిగించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. అగ్నిమాపక కేంద్రం వారు ఇచ్చే సలహాలను, సూచనలను అవగాహన చేసుకుని విద్యార్థులందరూ బాధ్యతాయుతంగా మెలగాలన్నారు. అనంతరం పాలకొల్లు అగ్నిమాపక కేంద్రం ఆఫీసర్ శ్రీనివాస్ వారి సిబ్బంది అగ్నిప్రమాదం సంభవించినప్పుడు చేపట్టాల్సిన జాగ్రత్తలను ప్రదర్శనల ద్వారా వివరించారు.

ఉండి : క్రీస్తు దీవెనలు అందరిపైనా ఉండాలని మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. ఆదివారం ఈస్టర్ పండుగను పురస్కరించుకుని అర్తమూరులోని దళితవాడలో ప్రార్థనా మందిరం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పలువురు సంఘ పెద్దలు మాట్లాడారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచి గోనబోయిన వీర్రాజు, మాజీ ఎంపిటిసి సభ్యులు గూట్ల వెంకటేశ్వరరావు, నామాల శామ్యూల్, బుజ్జిబాబు పాల్గొన్నారు.

ఘనంగా చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - గణపవరం

ఉండి : కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలు ఆదివారం టిడిపి మండల కమిటీ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు కూచంపూడి సురేందర్ కుమార్ రాజు కేక్‌కట్ చేసి కార్యకర్తలకు నాయకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాపారం చిన్న, పల్లి వెంకటేశ్వరరావు, పల్లి సతీష్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : రాష్ట్రంలో అభివృద్ధిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరుగులు పెట్టిస్తున్నారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాజ్జీ పేర్కొన్నారు. శేషమహల్ రోడ్డులోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద చంద్రబాబు పుట్టినరోజును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాజ్జీ మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పరిమి రవికుమార్, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు గంధం సతీష్, పెంటపాడు మండల ధ్యక్షులు కీలపర్తి వెంకటరావు పాల్గొన్నారు.

పెనుమంట్ర : ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో టిడిపి కమిటీ ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల జనసేన ప్రతినిధులు, కార్యకర్తలు వేడుకలు నిర్వహించారు. అనంతరం కేకులు కట్‌చేసి శుభాకాంక్షలు చెప్పారు.

ఉండి : చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు ఉండి మెయిన్ సెంటర్లో టిడిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల నడుమ మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కరిమెరక నాగరాజు, రాష్ట్ర నిర్వహణ కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు మాట్లాడారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఉండి డిసి వైస్ ఛైర్మన్ మంతెన సాయి లచ్చిరాజు, కాగిత మహంకాళి, జి.వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

కాళ్ల : చంద్రబాబు జన్మదిన వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా ఆదివారం నిర్వహించారు. ప్రధానంగా కాళ్ళ, పెదఅమిరం, కోపల్లె, ఏలూరుపాడు, జక్కరం, దొడ్డనపూడి, సీసలి తదితర గ్రామాల్లో టిడిపి నాయకులు కేకులు కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపిపి ఆరేటి వెంకటరత్న ప్రసాద్, డొక్కు సోమేశ్వరరావు, కాళ్ల గ్రామ అధ్యక్షుడు పెంటపాటి వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నరసాపురం : చంద్రబాబు నాయుడు అలుపెరగని యోధుడని మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు అన్నారు. చంద్రబాబు నాయుడు పుట్టినరోజును స్థానిక రాయిపేట కార్యాలయంలో మాధవనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అందరి సమక్షంలో మాధవ నాయుడు కేక్ కట్ చేసి పంచి పెట్టి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌ను మళ్లీ నవ్యాంధ్రప్రదేశ్ చేసేందుకు చంద్రబాబు నాయుడు అహర్నిశలూ కృషి చేస్తున్నారన్నారు. అలాగే అన్నా క్యాంటీన్ వద్ద చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎంఎల్ఎ కొత్తపల్లి జానకీరామ్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు కేక్ కట్ చేశారు.

మొగల్తూరు : స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో చంద్రబాబు పుట్టినరోజులు వేడుకలు పార్టీ మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేకును నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామరాజు కోసి పంపిణీ చేశారు. మామిడిశెట్టి సత్యనారాయణ, కత్తిమండ ముత్యాలరావు, కలిదిండి కుమార్ బాబు, పాలా రాంబాబు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నేతలు

ఎస్‌సి వర్గీకరణ ఆర్డినెన్స్ అమలుపై నిరసన

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి వర్గీకరణ ఆర్డినెన్స్ అమలు చేయడంపై ఆచంట నియోజకవర్గ మాల సంఘాల జెఎసి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం జెఎసి నాయకులు ఉన్నమట్ల మునిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్‌సి వర్గీకరణ ఆర్డినెన్స్‌ను జిఒ 16ను తక్షణం ఉప సంహరించుకోకపోతే మాలల ఆక్రోషానికి గురి కాక తప్పదని హెచ్చరించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తుంగలోతొక్కి కులాల మధ్య చిచ్చుపెట్టడమే తప్ప సామాజిక న్యాయం ఈ కూటమి ప్రభుత్వానికి చేతకాదని హెచ్చరించారు. మాల సంఘాల పేరుతో రాజకీయంగా ముందుకొచ్చి మాల జాతిని తాకట్టు పెట్టే విధంగా టిడిపి ప్రజా ప్రతినిధులు, నాయకులు వ్యవహరించడం సిగ్గుచేటని మాల సంఘాల జెఎసి నియోజకవర్గ ఛైర్మన్ సుంకర సీతారామ్ విమర్శించారు. ఈ నిరసనలో గౌరవాధ్యక్షులు బీరా మధు, మండల జెఎసి ఛైర్మన్ కోట వెంకటేశ్వరరావు, జెంట్రీ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి సాయం

పాలకొల్లు : ఆకివీడు పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న కానిస్టేబుల్ చినిమిల్లి వెంకటేశ్వరావు ఇటీవల మరణించారు. ఆయన కుటుంబానికి 2009 బ్యాచ్ కానిస్టేబుల్స్ అండగా నిలిచారు. పాలకొల్లులో ఆదివారం వెంకటేశ్వరరావు తల్లికి సహాయ ఫౌండేషన్ ద్వారా రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. ముందుగా సహాయ ఫౌండేషన్ టీం మెంబెర్స్ పాల్గొని వెంకటేశ్వరావు కుటుంబాన్ని పరామర్శించారు.

మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం అందేజేస్తున్న 2009 బ్యాచ్ కానిస్టేబుల్స్

టిడిపి వెలివర్రు గ్రామాధ్యక్షునిగా ప్రసాద్‌రాజు

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని వెలువర్రు టిడిపి గ్రామ అధ్యక్షుడిగా ముదునూరి ప్రసాద్‌రాజును గ్రామ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు తెలియజేశారు. ఆదివారం వెలువర్రు గ్రామంలో పార్టీ గ్రామ మాజీ అధ్యక్షుడు కలిదిండి వెంకటకృష్ణంరాజు (సిద్ధరాజు) నివాసం వద్ద ఏర్పాటుచేసిన గ్రామ కమిటీ సమావేశంలో ముదునూరి ప్రసాదరాజును గ్రామ అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామ మాజీ అధ్యక్షుడు సిద్ధరాజును ఘనంగా సత్కరించి సిఎం చంద్రబాబు చిత్రపటం అందజేశారు. ఈ సందర్భంగా పొత్తూరి వెంకటేశ్వరరాజు, కరిమెరక నాగరాజు మాట్లాడుతూ సిద్ధరాజు గ్రామంలో టిడిపి బలోపేతానికి కష్టపడి పని చేశారని నాయకులను కార్యకర్తలను ఏకతాటిపై నడిపించిన ఘనత కలిదిండి వెంకట కృష్ణంరాజు (సిద్ధరాజు)కు దక్కుతుందన్నారు. ముదునూరి ప్రసాదరాజు యువకుడు ఉత్సాహవంతుడు కాబట్టి గ్రామంలో అందర్నీ కలుపుకొని పోతూ టిడిపి బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది కృష్ణారావుకు మాతృవియోగం

నరసాపురం: శ్రీఆదికేశవ ఎంబరమన్నారు స్వామి ఆలయ ఛైర్మన్, సీనియర్ న్యాయవాది పుప్పాల వెంకట కృష్ణారావు మాతృమూర్తి పుప్పాల చంద్రావతి (84) ఆదివారం మృతి చెందారు. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమెకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. రెండో కుమారుడు పుప్పాల కృష్ణారావు నర్సాపురం బార్ అసోసియేషన్‌లో సీనియర్ న్యాయవాదిగా కొనసాగుతున్నారు. చంద్రావతి భర్త రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ భవాని ప్రసాద్ చంద్రావతికి స్వయానా మేనల్లుడు వరుస కానున్నారు.

టిడిపిలో ఐదుగురు సర్పంచులు చేరిక


మంత్రి ఆధ్వర్యంలో టిడిపిలో చేరిన వైసిపి సర్పంచులు

యలమంచిలి: మండలంలోని వైసిపికి చెందిన ఐదుగురు సర్పంచులు ఆదివారం జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు హాజరైన మంత్రి నిమ్మల రామానాయుడు వారందరికీ టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపి తీర్థం పుచ్చుకున్న వారిలో గుంపర్రు సర్పంచి తుంగ అమూల్య, దొడ్డిపట్ల సర్పంచి చెల్లుబోయిన ప్రమీలాకుమారి, బూరుగుపల్లి సర్పంచి చెల్లింకిల లక్ష్మి, నార్నిమెరక సర్పంచి వలవల లక్ష్మి, కంచు స్తంభంపాలెం సర్పంచి ఆకుల సూర్యనారాయణ ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రిగా నిమ్మల రామానాయుడు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, అదేవిధంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా టిడిపిలో చేరినట్లు తెలిపారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈ నెల 21వ తేదీ సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరగనుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.సామ్యూల్ తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులూ పాల్గొంటారని, ప్రజలు ఈ వేదిక ద్వారా లబ్ధి పొందాలని ఆయన కోరారు.

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం పురపాలక సంఘం కార్యాలయం వద్ద ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకూ యథావిధిగా నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు ఆదివారం ప్రకటనలో తెలియజేశారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, సమస్యలుంటే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని ఆలమూరు, ఓడూరు, నెలమూరు, భట్ల మగుటూరు, పొలమూరు, మాముడూరు, పెనుమంట్ర, మార్టేరు, తదితర గ్రామాల్లోని చర్చిల్లో ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. మత్తయి లూథరన్ చర్చిలో మార్టేరు, నెగ్గిపూడి గ్రామాలకు చెందిన పాస్టర్ పి.క్రిస్టఫర్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు.

కాళ్ల : మండలంలో పలు ప్రార్థనా మందిరాల్లో క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి సమాధుల వద్ద దీపాలు వెలిగించి, పుష్పాలు జల్లి ఈస్టర్ జరుపుకున్నారు.

తాడేపల్లిగూడెం : స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని క్రైస్ట్ సెంటినరీ లూథరన్ చర్చి ఏ క్లాస్ పేరిష్‌లో ఈస్టర్ పండుగను క్రైస్తవ విశ్వాసులు జరుపుకున్నారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు సమాధులతోటలో కుటుంబీకుల సమాధులను పువ్వులతో అలంకరించి, కొవ్వొత్తులు వెలిగించి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు.

మొగల్తూరు : మండలంలో ఈస్టర్ వేడుకలు క్రైస్తవులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాధులను ప్రత్యేకంగా పూలతో అలంకరించి, కొవ్వొత్తుల వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఉండి : క్రీస్తు దీవెనలు అందరిపైనా ఉండాలని మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. ఆదివారం ఈస్టర్ పండుగను పురస్కరించుకుని అర్తమూరులోని దళితవాడలో ప్రార్థనా మందిరం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పలువురు సంఘ పెద్దలు మాట్లాడారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచి గోనబోయిన వీర్రాజు, మాజీ ఎంపిటిసి సభ్యులు గూట్ల వెంకటేశ్వరరావు, శామ్యూల్, బుజ్జిబాబు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు, జూనియర్ అసిస్టెంట్ ఎం.జగదీష్ కుమార్ పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మావుళ్లమ్మకు వెండి అష్టలక్ష్మీ చెంబు విరాళం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మావుళ్లమ్మకు రాజమండ్రికి చెందిన వానపల్లి కుశ్వంత్ 385 గ్రాముల అష్టలక్ష్ముల అలంకారంతో తయారు చేసిన వెండి చెంబును ఆదివారం ఆలయ అధికారులకు అందజేశారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ ఆధ్వర్యంలో వారికి అమ్మవారి ప్రసాదం అందజేశారు.

బెల్టుషాపు నిర్వాహకుడు అరెస్టు

పాలకొల్లు : పాలకొల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఆదివారం నిర్వహించిన దాడుల్లో ఆచంట మండలం నీరుల్లిపాలెంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న ఎ.వెంకటేశ్వరరావును పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 7 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు పి.మహేష్, జి.రఘు సిబ్బంది పాల్గొన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పాలకొల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మద్దాల శ్రీనివాస్ హెచ్చరించారు.

ఇద్దరు క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులు అరెస్టు

పాలకొల్లు : హైదరాబాద్, విశాఖపట్నం కేంద్రాలుగా చేసుకొని ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరిని పట్టణ సిఐ కె.రజనీకుమార్ అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 2 లాప్‌టాప్స్, 10 మొబైల్ ఫోన్లు, రూ.33,000 నగదు, ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు నరసాపురం డిఎస్‌పి శ్రీవేద చెప్పారు. పాలకొల్లు పట్టణ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఉదయం 5 గంటల సమయంలో పాలకొల్లు టౌన్ పరిధిలో పెనుమదం బైపాస్ రోడ్ వద్ద గురుకుల పాఠశాల సమీపంలోని ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరిని పాలకొల్లు టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్నారు. వీరు మరో ఇరువురు వ్యక్తుల ప్రమేయంతో ఆడుతున్నారని, వారు పరారీలో ఉన్నారని త్వరలో పట్టుకుంటామని తెలిపారు. వారిలో ఒకరు వైసిపి నేత అని చెప్పారు. వారిని చాకచక్యంగా పట్టుకున్న రజనీ కుమార్‌ను జిల్లా ఎస్‌పి అభినందించారన్నారు.

CHANGE OF NAME

I KARRI SANTOSH REDDY S/o. SURIREDDY KARRI, HINDU Male, residing at 10-30-40/1,paiboina venkataramaiah gari veedhi Bhagyalakshmi peta, Tadepalli gudem,West Godavari Dist,AP solemly affirm as fallows 1) I am resident of Tadepalligudemin that my name noted as BADARALA SANTOSH but as per my Aadhar card &Pan card correct name is KARRI SANTOSH REDDY 2).Hence I confirm and affirm that my correct name is KARRI SANTOSH REDDY should be considered for all purpose.